సత్ఫలితాలిస్తున్న 'మొబైల్ హంట్'

- 91543 05600 నంబర్‌కు మెసేజ్ పంపితే రంగంలోకి సిబ్బంది
- తక్షణమే రికవరీకి చర్యలు
- ఆరు విడతల్లో రూ.5.92 కోట్ల విలువచేసే ఫోన్‌లు అప్పగింత


బాధితురాలికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

నెల్లూరు(క్రైమ్) : మీ సెల్‌ఫోన్ పోతే గతంలో ఆశలు వదులుకోవాల్సి వచ్చేది. ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే కొందరు ఫిర్యాదు తీసుకునేవారు కాదు. రూ.వేలు వెచ్చించి కొన్న ఫోన్, అందులో ఉన్న విలువైన సమాచారం పోయిందని బాధపడాల్సి వచ్చేది. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవు. మీరు పోలీసుస్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరమే లేదు. గతేడాది ఫిబ్రవరి 10వ తేదీన జిల్లాలో మొబైల్ హంట్ సేవలను ప్రారంభించారు. దీని ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను త్వరితగతిన గుర్తించి బాధితులకు అందజేస్తున్నారు. ఇప్పటివరకు ఆరు విడతల్లో రూ.5,92,50,000 విలువచేసే 2,356 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. అందులో రూ.7.5 లక్షల విలువ చేసే 36 మొబైల్స్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి రికవరీ చేశారు.

ఫిర్యాదు ఇలా..

సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు ముందుగా మొబైల్ హంట్ సెల్‌ఫోన్ నంబర్ 91543 05600కు వాట్సాప్ ద్వారా హాయ్ అని మెసేజ్ పంపాలి. వెంటనే జిల్లా పోలీసు పేరున మీ వివరాల కోసం లింక్ వస్తుంది. దానిని క్లిక్ చేయాలి. ఆ లింక్‌లో గూగుల్ ఫారం ఓపన్ చేసి ఫిర్యాదుదారుని పేరు, చిరునామా, చోరీ/పోయిన తేదీ, సమయం, పోయిన స్థలం, ఫోన్ మోడల్, కంపెనీ, రంగు, ఐఎంఈఐ నంబర్, ఈమెయిల్ ఐడీ, ఫిర్యాదుదారుని ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పత్రం, పోయిన ఫోన్‌లో ఉపయోగించిన నంబర్, సమాచారం కోసం మరో ఫోన్ నంబర్, పోలీసుస్టేషన్ పరిధి తదితర వివరాలను నమోదు చేసిన వెంటనే ఫిర్యాదు నమోదవుతుంది. సైబర్ క్రైమ్ టెక్నికల్ విభాగం వారి వద్దనున్న సాంకేతిక పరిజ్ఞానంతో మొబైల్‌ను ట్రేస్ చేస్తారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండానే పోయిన ఫోనును గుర్తించి అందజేస్తారు. మొబైల్ హంట్‌తో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ పోర్టల్‌లోనూ బాధితులు ఫిర్యాదు చేయవచ్చు.

సేవలను వినియోగించుకోవాలి

ప్రస్తుతం సెల్‌ఫోన్ లేనిదే రోజు గడవట్లుగా తయారైంది. రోజువారీ జీవితంలోనూ సెల్‌ఫోన్ ప్రముఖ పాత్ర పోషిస్తోంది. వృతిరీత్యా, వ్యక్తిగత పనుల్లో పడి సెల్‌ఫోన్ మర్చిపోవడం, పోగొట్టుకోవడం చేస్తుంటారు. అందులో నిక్షిప్తం చేసిన విలువైన సమాచారం, వ్యక్తిగత, కుటుంబ ఫొటోలు, వీడియోలు తదితర డేట అసాంఘిక వ్యక్తుల చేతిలో పడితే మరింత ప్రమాదం. దీనిని దృష్టిలో ఉంచుకుని మొబైల్ హంట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చాం. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. వీటి ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గుర్తించి బాధితులకు అందజేస్తున్నాం.

– కె.ఆరిఫ్ హాఫీజ్, ఎస్పీ

తాగునీటి కొరత లేకుండా చర్యలు


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట) : రాష్ట్ర ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, జాతీయ ఉపాధి హామీ పథకం, శాంతిభద్రతల పరిరక్షణపై అమరావతి సచివాలయం నుంచి ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరు నుంచి కలెక్టర్ ఎం.హరినారాయణన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ తాగునీటికి ఇబ్బందుల్లేకుండా ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేయాలని చెప్పారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద కూలీలకు ఎక్కువ శాతం పనులు కల్పించాలని చెప్పారు.

కౌన్సెలింగ్ నిర్వహించాలి


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు

నెల్లూరు (టౌన్) : గతంలో విద్యాశాఖ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు 2024–25 విద్యా సంవత్సరానికి కౌన్సెలింగ్ నిర్వహించాలని 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర తెలిపారు. ఈ మేరకు మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ రామారావును కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ వేతనం ప్రభుత్వం ఇస్తున్న దృష్ట్యా తమ నివాస ప్రాంతాల దగ్గరి మండలాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఏ జిల్లాలో జరగని విధంగా ఉమ్మడి జిల్లాలోని 22 మండలాల్లో కనీసం రవాణా సౌకర్యాలు లేని పాఠశాలల్లో పోస్టులు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరం జూన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి అన్ని మండలాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను చూపించి తమకు పాఠశాలలను కేటాయించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంటీఎస్ ఉపాధ్యాయులు సయ్యద్ నయిముద్దీన్, సయ్యద్ ఫరూఖ్, శ్రీనివాసులు, బాలాజీసింగ్, వేణు, రమణయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శత చండీయాగ మహోత్సవం


మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లూరు(బారకాసు) : వేదాయపాళెంలోని త్యాగరాజనగర్‌లో ఉన్న సద్గురు త్యాగరాజస్వామి మందిరంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న శత చండీయాగ మహోత్సవం మంగళవారం పూర్తయింది. బ్రహ్మశ్రీ మాచవోలు వెంటసుబ్బయ్య ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ఉదయం చండీ హోమం నిర్వహించారు. ప్రదోషం సందర్భంగా సాయంత్రం నందీశ్వరునికి, శివునికి ఏకకాలంలో పంచామృతాభిషేకం, లఘు పూర్ణాహుతి జరిపించారు. మందిరంలో కొలువైన సిద్ధివిఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యం, జ్ఞాన సరస్వతి, ఆదిత్యాది నవగ్రహ, శిరిడీ సాయినాథ, దక్షిణామూర్తి, కమలాంభిక సమేత త్యాగరాజేశ్వర, సీతారామ లక్ష్మణ హనుమత్సమేత సద్గురు త్యాగరాజస్వామికి విశేషాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా త్యాగరాజ మందిర నిర్వాహక కమిటీ సభ్యుడు ఎనమండ్ర నాగదేవిప్రసాద్ మాట్లాడుతూ శత చండీ యాగం మంగళవారం మహా పూర్ణాహుతితో పరిసమాప్తమైందని తెలిపారు. ఉదయం 7 నుంచి రుద్ర, పురుష, శ్రీమన్యుసూక్త హోమం, తదుపరి చండీ హోమం, మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం, బాలపూజ తదితరాలను నిర్వహించినట్లు వివరించారు. భక్తులు ఆయా పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలను మందిర ధర్మకర్త ఎనమండ్ర చైతన్యకుమార్, వైష్ణవి దంపతులు, త్యాగరాజ మందిర నిర్వాహక కమిటీ సభ్యులు, భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

న్యాయవాది మృతికి పలువురి సంతాపం


సయ్యద్ షకీల్ అహ్మద్ (ఫైల్)

నెల్లూరు (లీగల్) : నగరంలోని జెండావీధి ప్రాంతానికి చెందిన సీనియర్ న్యాయవాది సయ్యద్ షకీల్ అహ్మద్ మంగళవారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన భౌతికదేహాన్ని పలువురు న్యాయవాదులు సందర్శించి నివాళులర్పించారు. బార్ కౌన్సిల్ సభ్యులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమామహేశ్వర్‌రెడ్డి, సుందరయ్య యాదవ్, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జి ఆర్.రోజారెడ్డి తదితరులు వారి సంతాపాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

నాలుగో రోజు సంస్మరణోత్సవాలు


రామలాలశర్మకు సత్కారం

నెల్లూరు(బారకాసు) : నగరంలోని పొగతోటలో ఉన్న ఆదిశంకర ధ్యాన మందిరంలో చక్రాలవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో నాలుగో రోజు మంగళవారం ఆదిశంకరాచార్యుల సంస్మరణ వారోత్సవాలు కొనసాగింది. విశ్రాంత ఆచార్యులు బ్రహ్మశ్రీ ఓరుగంటి శ్రీరామలాలశర్మ ఉదయం 8 గంటలకు 'చతుస్సూత్రి' ప్రవచనం చేయగా సాయంత్రం 6 గంటలకు ఆధ్యాత్మికోపన్యాసాలు చేశారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో చక్రాల ఆనంద్‌కుమార్, పొందూరు వెంకటేశ్వర ప్రసాద్, చక్రాల వెంకట లక్ష్మీనరసింహం, గన్నవరం ప్రభాకరశర్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పౌష్టికాహారాన్ని అందజేస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ

నెల్లూరు(అర్బన్) : ప్రభుత్వం ఇచ్చే పథకాలు, మందులను సద్వినియోగం చేసుకోవాలని వైద్యారోగ్యశాఖ అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలి సూచించారు. విధి వంచితులైన 200 మంది పిల్లలకు స్థానిక కొండాయపాళెంలోని అబైడింగ్ హోప్ ట్రస్ట్ చైర్మన్ నిర్మల్‌కుమార్ మంగళవారం పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏడీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలి హాజరై, మాట్లాడారు. ఆరోగ్యపరంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న పిల్లల సంరక్షణకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. అయినప్పటికీ దాతలు ఇలాంటి పిల్లలను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 200 మందికి ఒక్కొక్కరికీ రూ.1,500 విలువైన పౌష్టికాహారాన్ని ప్రతి నెలా అందజేస్తున్న అబైడింగ్ హోమ్ ట్రస్ట్ చైర్మన్ నిర్మల్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఫాదర్ రోసారయో, అనుమల జయప్రకాష్, మరియమ్మ, శశి, దేవకృప, విలియమ్స్, క్రాంతి, హేమంత్, జయశ్రీ పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ ఉద్యోగుల ఆర్థిక సాయం


వాణి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న డీఆర్‌డీఏ ఏపీడీ, జేఏసీ నేతలు

నెల్లూరు(పొగతోట) : డీఆర్‌డీఏలో ఎంఎస్ సీసీగా పనిచేస్తున్న సిద్ధి వాణి అనారోగ్యంతో మరణించారు. దీంతో ఆమె కుటుంబాన్ని ఆదుకునేందుకు జిల్లాలోని డీఆర్‌డీఏ ఉద్యోగులందరూ ఒకనెల వేతనం రూ.4,67,354ను సహాయంగా అందజేశారు. ఈ మేరకు చెక్కును మంగళవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో ఏపీడీ రాజు చేతుల మీదుగా వాణి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ జేఏసీ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు


రైతులతో మాట్లాడుతున్న శ్రీనివాసులు

నెల్లూరు సిటీ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతు భరోసా కేంద్రంలో పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ, పిల్లిపెసరను 50 శాతం రాయితీపై అందిస్తున్నట్లు నెల్లూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎస్.శ్రీనివాసులు పేర్కొన్నారు. రూరల్ మండలంలోని కాకుపల్లి బిట్–2, పెనుబర్తి గ్రామాల్లోని రైతులతో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ విస్తరణాధికారి అనిత, ఆర్బీకే సిబ్బంది దేవరాజు, రైతులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు చేపట్టాలి


మాట్లాడుతున్న హంస అసోసియేషన్ నాయకులు

నెల్లూరు(అర్బన్) : శ్రీకాకుళం జిల్లా రణస్థలం సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధి నిర్వహణలో ఉన్న వైద్యశాఖ డాక్టర్లు, సిబ్బందిపై దాడులు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపట్టాలని హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(హంస) నెల్లూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చేజర్ల సుధాకర్ రావు, కమల్‌కిరణ్ డిమాండ్ చేశారు. స్థానిక హరనాథపురంలోని ఆ సంస్థ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రోగులకు వైద్యం అందిస్తున్న సమయంలో కొంతమంది దాడులకు పాల్పడి ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి భయాందోళనకు గురి చేయడం దుర్మార్గమన్నారు. ఎవరికైనా ఏమైనా సమస్యలుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయాలని, లేదంటే చట్టబద్ధంగా వ్యవహరించాలన్నారు. అలా కాకుండా దాడులకు పాల్పడితే రోగులకు ఎలా వైద్యం చేయగలరన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని న్యాయం చేయాలని, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో హంస జిల్లా నాయకులు పరిమళ, జలీల్‌అహ్మద్, బెనర్జీ, ఆసియాబేగం, వేణు, సుమతి, ఉమావరకుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పోలీసుల మాక్‌డ్రిల్

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు
- ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్


అల్లరిమూకలకు సర్దిచెబుతున్న ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

నెల్లూరు(క్రైమ్): నిత్యం రద్దీగా ఉండే గాంధీబొమ్మ కూడలిలో మంగళవారం సాయంత్రం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కొందరు గుంపుగా వచ్చి అల్లర్లకు, దౌర్జన్యాలకు దిగారు. సమాచారం అందుకున్న ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ నేతృత్వంలో పోలీసు అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఫలితం కానరాలేదు. ఆందోళనకారులు తిరగబడ్డారు. దీంతో పోలీసులు లాఠీలకు పని చెప్పి వారిని అక్కడనుంచి చెదరగొట్టారు. ఈ ఘర్షణలో పోలీసు సిబ్బందితోపాటు కొందరికి గాయాలయ్యాయి. వారిని హుటాహుటిన అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఇదంతా చూస్తున్న ప్రజలకు అక్కడ ఏం జరుగుతుందో అర్థం కాలేదు. చివరకు ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అవగాహన కల్పించేందుకు పోలీసులు నిర్వహించిన మాక్‌డ్రిల్ అని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు.

- సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు వేళ ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ అన్నారు.

మాక్‌డ్రిల్ అనంతరం ఆయన మాట్లాడుతూ ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా, హింసాత్మక చర్యలకు పాల్పడినా, అల్లర్లు చేసినా ఎలా స్పందించాలి?, జనసమూహాలను ఎలా అదుపుచేయాలి? అన్న వాటిపై మాక్‌డ్రిల్ నిర్వహించామన్నారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా సిబ్బంది సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలను పరిరక్షించాలన్నారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ విధ్వంసానికి ప్రయత్నించే అల్లరిమూకలను అణిచి వేసేందుకు, అత్యవసర సమయాల్లో పరిస్థితిని అదుపులోకి తీసుకుని వచ్చేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పోలీసులు తీసుకుంటున్న చర్యలకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల చట్టప్రకారమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, శ్రీనివాసరావు, నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్‌లు కె.రామకృష్ణారెడ్డి, బి.అశోక్‌కుమార్, ఎం.బాబీ, ఎ.సుబ్బారాజు, అల్తాఫ్ హుస్సేన్, వీవీ నారాయణ, ఎల్ వీరా నాయక్, ఎఆర్, స్పెషల్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అల్లరిమూకలపై పోలీసుల లాఠీచార్జి


గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తూ..

సుందరయ్య సేవలు స్ఫూర్తిదాయకం


రక్తదాన శిబిరం ప్రారంభోత్సవంలో నాయకులు


రక్తదానం చేస్తున్న వైద్యసిబ్బంది

నెల్లూరు(అర్బన్) : దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతగా పేరొందిన పుచ్చలపల్లి సుందరయ్య సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు నరమాల సతీష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సందానీబాషా పేర్కొన్నారు. సుందరయ్య వర్ధంతి వారోత్సవాల సందర్భంగా మంగళవారం స్థానిక దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుందరయ్యకు నివాళులర్పించారు. అనంతరం జరిగిన రక్తదాన శిబిరంలో వారు మాట్లాడుతూ సుందరయ్య నిత్యం ప్రజా సమస్యలపై పోరాటం చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో వేసవి కాలంలో ఆస్పత్రికి వచ్చే రోగుల కోసం రక్తదానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రూరల్ కార్యదర్శి కిన్నెరకుమార్, అధ్యక్షుడు శ్రీనివాసులు, సహాయ ఆచార్యులు రాజీవ్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాగునీటి సరఫరాకు అంతరాయం నేడు

నెల్లూరు(బారకాస) : నగరపాలక సంస్థ పరిధిలోని సమ్మర్ స్టోరేజ్ వద్ద ట్యాంక్ క్లియర్ వాటర్ పంపింగ్ స్టేషన్ నుంచి కొత్తూరుకు వెళ్లే పంపింగ్ మెయిన్‌కు మరమ్మతులు చేస్తున్నందున బుధవారం కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కమిషనర్ వికాస్‌మర్మత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొత్తూరు వన్, టు, శ్రీలంక కాలనీ, బుజబుజ నెల్లూరు, చంద్రబాబునగర్, కిచరగుంట రిజర్వాయర్ల పరిధిలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలియజేశారు. ఆయా ప్రాంతాల ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు. తిరిగి 23వ తేదీన యథావిధిగా నీటి సరఫరా చేస్తామన్నారు.

రాజరాజేశ్వరి దేవస్థానంలో హుండీ కానుకల లెక్కింపు



నెల్లూరు(బారకాసు) : నెల్లూరు నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 62 రోజుల పాటు భక్తులు హుండీలో వేసిన కానుకలను లెక్కించగా రూ.16,39,705 ఆదాయం వచ్చింది. అలాగే అన్నదానం కోసం రూ.37,418 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి జె.శ్రీనివాస్, రిటైర్డ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

జగదేవిపేటలో రైతు సదస్సు

ఇందుకూరుపేట : ఎస్వీ వ్యవసాయ కళాశాల బీఎస్సీ విద్యార్థుల ఆధ్వర్యంలో మండలంలోని జగదేవిపేటలో మంగళవారం రైతు సదస్సు జరిగింది. ఆర్ఏడబ్ల్యూపీ కార్యక్రమంలో భాగంగా జరిగిన సదస్సులో ఆత్మ డీపీడీ శివనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. క్షేత్రస్థాయిలో తెలుసుకునే విషయాలు విద్యార్థులకు భవిష్యత్తులో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు వివిధ పంటలు, సాగు విధానాలు, మెళకువలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. వాటికి సంబంధించిన చిత్రపటాలు, నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ శివజ్యోతి, స్థానిక ఏడీఏ రాజ్‌కుమార్, కేవీకే సభ్యులు లోకేశ్, కిరణ్, ఏఈఓ వాగ్దేవి, వీఏఏలు నవీన్, సుమలత, నరేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయశాఖ అధికారులు డేవీస్‌పేటలో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. మట్టి నమూనా ఆధారంగా పంటలు, ఎరువుల ఎంపిక చేసుకోవాలని కోరారు.

సింహ వాహనంపై కోదండరాముడు

కోవూరు : మండల కేంద్రమైన కోవూరులోని గాంధీ బొమ్మ సెంటర్‌లో వెలసిన కోదండరామ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు సింహ వాహనంపై విహరించారు. గ్రామ వీధుల్లో ఊరేగిస్తున్న స్వామివారిని భక్తులు దర్శించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత స్వామివారికి పల్లకిసేవ జరిపించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా భీమేశ్వరరావు, సుధా దంపతులు వ్యవహరించారు. ఆలయ ప్రధానార్చకుడు శ్రీకాంతాచార్యులు పూజా కార్యక్రమాలు జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రసన్న విశ్వేశ్వరునికి రావణసేవ

ఇందుకూరుపేట : బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని మైపాడులో కొలువైన అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరునికి మంగళవారం రావణసేవ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగించారు. విద్యుత్ వెలుగులో ఊరేగుతున్న స్వామివారికి కొబ్బరికాయ, కర్పూర హారతులు అందజేసి స్వాగతం పలికారు. ఆలయ అర్చకుడు బండారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఉభయకర్తలుగా బొద్దుకూరు శ్రీనివాసులు, ప్రసన్న దంపతులు వ్యవహరించారు. ఉదయం చప్పర ఉత్సవం వేడుకగా జరిగింది. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో కోలాహలం నెలకొంది.

పోస్టర్ ఆవిష్కరణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో వెలసిన కామాక్షితాయి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో జరిగింది. ఆర్డీఓ మలోలా, ఆలయ ఈఓ గిరికృష్ణ కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. ఈనెల 28 నుంచి కామాక్షి తాయి అమ్మవారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.